క్లుప్తంగా

ప్రతి ఇంటా వెలుగులు నిండాలి



కాటసాని రామిరెడ్డి

బనగానపల్లె: నియోజకవర్గ ప్రజలందరూ దీపావళి పండుగను ఆనందోత్సవాల మధ్య సంతోషంగా జరుపుకోవాలని మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ఆకాంక్షించారు. మనలో కొత్త ఉత్సాహం, స్ఫూర్తి నింపే వెలుగుల పండుగను ఐక్యతతో, ఆనందంతో జరుపుకోవాలన్నారు. ప్రజలందరికీ దీపావళి శుభాకాంక్షలు తెలిపారు.

వైఎస్సార్‌సీపీ నేత మృతికి నివాళి

బనగానపల్లె: పట్టణానికి చెందిన వైఎస్సార్‌సీపీ నేత, 97వ బూత్ కమిటీ కన్వీనర్ జిన్నూ మాబుసా(60) ఆదివారం గుండెపోటుతో మృతిచెందాడు. మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి మృతదేహానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. మృతుని కుమార్తె ఖాతున్‌బీ ఎంపీటీసీ సభ్యురాలిగా ఉన్నారు.

టపాకాయల దుకాణాల తనిఖీ

బేతంచెర్ల: పట్టణంలోని ఓల్డ్ పోలీస్ క్వార్టర్స్ ప్రాంతంలో దీపావళి పండుగ సందర్భంగా ఏర్పాటు చేసిన టపాకాయల దుకాణాలను సీఐ వెంకటేశ్వరరావు, ఎస్‌ఐ రమేష్‌బాబు ఆదివారం తనిఖీ చేశారు. దుకాణదారులు ప్రతి షాపు మధ్య 10 అడుగుల దూరం పాటించాలని, దగ్గరలో వాటర్‌డ్రమ్ములు, ఇసుక బకెట్లు ఉంచాలని సూచించారు. నిబంధనలు అతిక్రమిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

నివాళి

అవుకు(కొలిమిగుండ్ల): మండల పరిధిలోని గుండ్లశింగవరానికి చెందిన కంబయ్య కుమారుడు రామ్మోహన్(42) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ అవుకు మండల కన్వీనర్ కాటసాని తిరుపాల్‌రెడ్డి మృతదేహం వద్ద నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

కార్తీకం.. శుభప్రదం

• శైవక్షేత్రాల్లో కార్తీక పూజలకు ఏర్పాట్లు

కొలిమిగుండ్ల: అన్ని మాసాల్లో కెల్లా కార్తీక మాసానికి ప్రత్యేక ఉందని పురాణాలు చెబుతున్నాయి. శివునికి, విష్ణువుకు ఇద్దరికీ ఎంతో ఇష్టమైన మాసం కాబట్టి మానవాళికి వారిద్దరిని కొలిచి తరిస్తే శుభాలు కలుగుతాయని భక్తుల నమ్మకం. కార్తీక మాసంలో ప్రతి రోజు పవిత్రమైందిగా భావిస్తారు. నెల పాటు చేసే కృత్యాల ఫలితం ఒక ఎత్తయితే పౌర్ణమి నాటి కృత్యాలు ఫలితం మరొక ఎత్తు. కార్తీక మాసంలో వ్రతాలు, పూజలు, దీపారాధన, దైవారాధనకు అత్యంత ప్రాధాన్యత ఇస్తారు. పౌర్ణమి రోజున రుద్రాభిషేకం చేయించిన వారికి సకల సంపదలు దరిచేరుతాయని భక్తుల ప్రగాఢ నమ్మకం.

22 నుంచి కార్తీక మాసం ఆరంభం

దీపావళి సంబరాలు ముగిసిన వెంటనే కార్తీక మాసం ప్రారంభం కానుంది. శివకేశవుల భక్తులంతా ఎంతో ఆసక్తిగా ఎదురుచూసే సమయమిది. ఈనెల 22 నుంచి నవంబర్ 20తో కార్తీక మాసం ముగియనుంది. శైవక్షేత్రాల్లో కార్తీక మాసం అంతా ధూప దీపాలు, శివనామస్మరణతో ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంటుంది. ఈ మాసంలో మహిళలు ప్రత్యేకంగా నిష్టగా పూజలు చేస్తారు. తెల్లవారు జామునే కార్తీక స్నానాలు ఆచరించి శివాలయాలకు చేరుకుని దీపాలు వెలిగిస్తారు. ఈ మాసం నుంచి మకర సంక్రాంతి వరకు అయ్యప్ప స్వామి భక్తులు మాలధారణ చేస్తారు. బనగానపల్లె నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న శైవక్షేత్రాల్లో కార్తీక మాస పూజలకు ఏర్పాట్లు పూర్తి చేశారు. యాగంటి పుణ్యక్షేత్రం, నేల బిలుం మల్లేశ్వరస్వామి ఆలయం, నయనాలప్ప ఆలయం, అవుకు పట్టణంలోని కాశీవిశ్వనాథుడి ఆలయంతో పాటు పలు చోట్ల శివాలయాల్లో ప్రత్యేక పూజలు పెద్ద ఎత్తున నిర్వహించేందుకు సిద్ధం చేశారు. కొలిమిగుండ్ల లలితా సుందరేశ్వరస్వామి ఆలయంలో పౌర్ణమి రోజున జ్వాలాతోరణం వెలిగిస్తారు. దాతల సహకారంతో భక్తులకు అన్నదానం నిర్వహించనున్నారు. బందార్లపల్లె సమీపంలోని నేల బిలుం మల్లేశ్వరస్వామి ఆలయంలో కడ సోమవారం రోజున పెద్ద ఎత్తున తిరునాల నిర్వహిస్తారు.



కొలిమిగుండ్లలోని లలితా సుందరేశ్వరస్వామి ఆలయం

కార్తీక మాసం వివరాలు

మొదటి సోమవారం	అక్టోబర్ 27
రెండో సోమవారం	నవంబర్ 03
మూడో సోమవారం	నవంబర్10
నాల్గవ సోమవారం	నవంబర్ 17

ఏపీటీఎఫ్ నూతన కార్యవర్గం



కోవెలకుంట్ల: పట్టణంలోని ప్రాథమిక మెయిన్ పాఠశాలలో ఆదివారం ఏపీటీఎఫ్ రెండు మండలాల నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రామచంద్రారెడ్డి, శివయ్య ఆధ్వర్యంలో కోవెలకుంట్ల, సంజామల మండలాల కార్యవర్గాలను ఎన్నుకున్నారు. కోవెలకుంట్ల మండల అధ్యక్షుడిగా వేదవ్యాస్, ప్రధాన కార్యదర్శిగా ప్రేమ్‌కుమార్, ఉపాధ్యక్షులుగా కళ్యాణ్‌కుమార్, దస్తగిరి, ప్రసన్నలక్ష్మి, ప్రసాద్, కార్యదర్శులుగా సుధాకర్, శ్రీదేవి, సునీల్, జిల్లా కౌన్సిలర్‌గా శ్రీనివాసులను ఎన్నుకున్నారు. అలాగే సంజామల మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా విద్యాసాగర్, విజయ్‌భాస్కర్, ఉపాధ్యక్షులుగా సునీల్, రామాంజినేయులు, ఇబ్రహీం, పుల్లమ్మ, కార్యదర్శులుగా పద్మశేఖర్, లక్ష్మీప్రసన్న, నీలిమరాణి, సుంకన్న, సూర్యనారాయణ, జిల్లా కౌన్సిలర్‌గా హమీద్‌బాషాను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

క్రికెట్ కిట్లు పంపిణీ

బేతంచెర్ల: మండలంలోని కొలుముపల్లె గ్రామానికి చెందిన క్రికెట్ క్రీడాకారులకు సింగిల్ విండో చైర్మన్ ఉన్నం చంద్రశేఖర్ ఆదివారం క్రికెట్ కిట్‌లు, క్రీడా దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చదువుతో పాటు క్రీడల్లో రాణించి గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని క్రీడాకారులకు సూచించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ హుసేన్‌రెడ్డి పాల్గొన్నారు.

మహిమాన్విత యాగంటి

బనగానపల్లె రూరల్: బనగానపల్లె మండలంలో ఎర్రమల పర్వతశ్రేణుల మధ్య మహిమాన్వితంగా వెలసిన యాగంటి ఉమామహేశ్వర స్వామి క్షేత్రం ప్రసిద్ధ పుణ్యస్థలంగా పేరొందింది. విజయనగర రాజులు హరహర బుక్కరాయులు ఈ ఆలయాన్ని నిర్మించినట్లు శాసనాలు తెలుపుతున్నాయి. అనంతరం పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఇక్కడ సంచరించి గరిమిరెడ్డి అచ్చమ్మకు జ్ఞానబోధ చేసినట్లు ప్రాచీన కథనాలు చెబుతున్నాయి. ఇక్కడి నంది క్రమంగా పెరుగుతుండడం విశేషం. ఉమామహేశ్వర స్వామి దంపతులు విగ్రహ రూపంలో ఉన్న దేవాలయం యాగంటి. ప్రకృతి సౌందర్యంతో నిండిన ఈ క్షేత్రంలో పెద్దకొనేరు, చిన్నకొనేరు, వెంకటేశ్వరస్వామి గుహ, పెరుగుతున్న నంది విగ్రహం, ఎత్తైన గోపురాలు వంటి అనేక ఆకర్షణలు భక్తులను మంత్రముగ్ధులను చేస్తాయి. ''నేకంటి-నేగంటి'' అనునానుడి నుంచి ''యాగంటి''గా పరిణమించిన ఈ క్షేత్రానికి ప్రతి రోజూ భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు. భక్తుల సౌకర్యార్థం ఆలయ పరిసరాల్లో సెంట్రల్ లైటింగ్, పాతపాడు నుంచి ఆలయానికి రహదారి, అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఉమామహేశ్వర నిత్యాన్నదాన సంస్థ, రైతు నిత్యాన్నదాన సంస్థల ద్వారా భక్తులకు ఉచిత భోజనం అందిస్తున్నారు.



ఏకశిలా రూపంలోఉమామహేశ్వరుడు

ఈ నెల 22 నుంచి కార్తీక మహోత్సవాలు

ఆలయంలో ఈ నెల 22 నుంచి నవంబర్ 20వ తేదీ వరకు కార్తీక మాస ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఈఓ పాండురంగారెడ్డి తెలిపారు సోమవారం అక్టోబరు 27న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. నవంబరు 3, 10, 17 తేదీల్లో వరుసగా రెండవ, మూడవ, నాల్గవ సోమవారం ఉత్సవాలు జరగనున్నాయి. నవంబరు 5న కార్తీక పౌర్ణమి సందర్భంగా లక్షదీపోత్సవం ఘనంగా నిర్వహించనున్నారు.

ఉత్సవాలకు ఏర్పాట్లు

బేతంచెర్ల: దేవతలు ముచ్చటపడి భూలోకంలో నెలకొల్పిన ఆలయంగా ముచ్చట్ల మల్లికార్జునస్వామి ఆలయం ప్రసిద్ధి చెందింది. ఈనెల 22 నుంచి ప్రారంభమయ్యే కార్తీక మాస ఉత్సవాలకు ఏర్పాట్లు చేస్తున్నారు.

ఆలయ చరిత్ర

ఇక్కడ ముక్కోటి దేవతలు శివలింగ ప్రతిష్ఠాపన చేశారని భక్తుల నమ్మకం. మరికొన్ని కథనాల ప్రకారం, అగస్త్య మహాముని శివలింగ ప్రతిష్ఠాపన చేయగా జనమేజయుడు ఆలయాన్ని నిర్మించినట్లు భావిస్తారు. శ్రీశైల మల్లికార్జున స్వామి అంశే ఇక్కడ స్వయంభు లింగంగా వెలసినది అని నమ్ముతారు. ప్రతి సోమవారం రుద్రాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఈ ఆలయ గోపుర నిర్మాణం శ్రీకృష్ణదేవరాయులు కాలంలో నిర్మించినట్లు శాసనాల ద్వారా తెలుస్తోంది. 2022లో అప్పటి ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి చొరవతో ఆలయానికి 3 కోట్లు ఖర్చు చేసి బీటీ రోడ్డు ఏర్పాటు చేశారు. 2024లో గాలిగోపురం పునరుద్ధరణ, గ్రానైట్ ఫ్లోరింగ్, కోనేరు, రథశాల నిర్మాణానికి రూ.1.90 కోట్ల నిధులు మంజూరు చేసి భూమిపూజ నిర్వహించగా, తర్వాత ఎన్నికలు రావడంతో పనులు నిలిచిపోయాయి. ఈ ఏడాది ఏప్రిల్ నెలలో కళ్యాణమండపం పనులు ప్రారంభించగా, మూడు నెలల క్రితం కాంట్రాక్టర్ పనులను మధ్యలో నిలిపివేశాడు.



ముచ్చట్ల మల్లికార్జునస్వామి ఆలయం, (ఇన్‌సెట్)మల్లికార్జునస్వామి

శాస్త్రోక్తంగా ప్రాణప్రతిష్ఠ పూజలు

కొలిమిగుండ్ల: మండల కేంద్రం కొలిమిగుండ్లలోని లలితా సుందరేశ్వరస్వామి ఆలయంలో శివపార్వతుల ఉత్సవమూర్తులకు వేదపండితుడు ఆలూరి నరసింహ ప్రసాద్ ఆధ్వర్యంలో ఆదివారం ప్రాణప్రతిష్ఠ చేశారు. దాతల సహకారంతో రూ.75 వేలతో ఉత్సవ విగ్రహాలను తయారు చేయించారు. ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ప్రాణ ప్రతిష్ఠ చేసి సంప్రోక్షణ చేశారు. కార్తీక పౌర్ణమి రోజున ఉత్సవ విగ్రహాలను గ్రామోత్సవం నిర్వహిస్తామని నరసింహప్రసాద్ తెలిపారు. సర్పంచ్ శివరాముడు, భక్తులు జయరాముడు, లక్ష్మిరెడ్డి, కదిరిరెడ్డి, కంబయ్య తదితరులు పాల్గొన్నారు.

డోన్ విద్యార్థికి సీఎం ప్రశంసలు

డోన్ టౌన్: పట్టణంలోని తారకరామనగర్‌కు చెందిన ఆనంద్, శివలక్ష్మి దంపతుల కుమారుడు ప్రేమ్‌రాజ్ సీఎం చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందుకున్నాడు. ఇతను ఆదోని సమీపంలోని అరికెర సాంఘిక సంక్షేమ హాస్టల్‌లో 9వ తరగతి చదువుతున్నాడు. ఈనెల 16వ తేదీ కర్నూలు పర్యటనకు వచ్చిన ప్రధాని నరేంద్ర మోదీకి జీఎస్టీ 2.0, సూపర్ జీఎస్టీ- సూపర్ సేవింగ్స్ అంశాలను కాన్వాస్ బోర్డ్‌లో పొందుపరిచి చిత్రపటంగా బహూకరించారు. దీంతో ఈ నెల 17న విజయవాడలోని సీఎం క్యాంపు కార్యాలయంలో విద్యార్థికి ప్రశంసా పత్రం అందించి అభినందించారు. కాగా విద్యార్థి ఈ ఏడాది మార్చిలో సత్తెనపల్లిలో జరిగిన రాష్ట్ర స్థాయి డ్రాయింగ్ పోటీల్లో రెండో బహుమతి అందుకున్నాడు.

జోళదరాశిలో కార్డన్‌సెర్చ్

కోవెలకుంట్ల: మండలంలోని జోళదరాశి గ్రామంలో ఆదివారం పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. కోవెలకుంట్ల సీఐ హనుమంతునాయక్ నేతృత్వంలో కోవెలకుంట్ల, సంజామల ఎస్‌ఐలు మల్లికార్జునరెడ్డి, రమణయ్య పాల్గొన్నారు. గ్రామంలోని అనుమానితుల ఇళ్లలో సోదాలు చేశారు. ఎలాంటి మారణాయుధాలు లభ్యం కాలేదు. అనంతరం గ్రామస్తులను ఉద్దేశించి సీఐ మాట్లాడుతూ.. ఇటీవల సైబర్ నేరాలు విస్తరిస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గ్రామాల్లో అనుమానాస్పద వ్యక్తులు తిరుగుతుంటే వెంటనే పోలీసులకు సమాచారం అందజేయాలని కోరారు. మట్కా, పేకాట వంటి అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా ప్రజలు సహకరించాలని తెలిపారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. హెల్మెట్ లేకుండా బైక్ నడిపితే జరిమానాలు తప్పవని హెచ్చరించారు.

డోన్ సర్కిల్‌లో 79 బెల్టుషాపులపై కేసులు

డోన్: డోన్ ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటివరకు 79 బెల్టుషాపు నిర్వాహకులపై కేసులు నమోదు చేసినట్లు ఆ శాఖ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వరలక్ష్మి తెలిపారు. ఆదివారం స్థానిక ఎక్సైజ్ కార్యాలయంలో పాత్రికేయులతో ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఎక్కడైనా బెల్టుషాపుల ద్వారా మద్యం విక్రయిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సర్కిల్ పరిధిలో 149 నాటుసారా తయారీదారులపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. అలాగే 89 మంది పాత నేరస్తులపై బైండోవర్ చర్యలు తీసుకున్నామని చెప్పారు. నకిలీ మద్యం తయారీ, విక్రయంపై నిఘా పెంచి, పాత నేరస్తుల కదలికలను నిరంతరం పర్యవేక్షిస్తున్నామని వెల్లడించారు. బెల్టుషాపులు లేదా నకిలీ మద్యం తయారీ, విక్రయం జరిగితే సమాచారమిచ్చే వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. సమాచారం ఉన్నవారు 9440902584 నంబర్‌కు తెలియజేయాలని సూచించారు.

వ్యవసాయానికి విద్యుత్ వేళలు

కోవెలకుంట్ల: మండలంలోని ఆయా ఫీడర్ల పరిధిలో సోమవారం నుంచి వ్యవసాయ రంగానికి పగటి వేళల్లో తొమ్మిది గంటల విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు ఆ శాఖ ఏఈ రామమోహన్ తెలిపారు. అమడాల, గుంజలపాడు, జోళదరాశి, గుళ్లదూర్తి, పొట్టిపాడు, హరివరం, అల్లూరు, కొత్తపల్లె, కలుగొట్ల, కొప్పెర్ల, రేవనూరు ఫీడర్ల పరిధిలోని గ్రామాలకు ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందని పేర్కొన్నారు.

పీఆర్సీని నియమించాలి

కోవెలకుంట్ల: వేతన సవరణ సంఘం(పీఆర్సీ)ని నియమించాలని రాష్ట్ర జాతీయ ఉపాధ్యాయ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ఎం షరీఫ్ డిమాండ్ చేశారు. ఆదివారం విలేకరలతో మాట్లాడుతూ.. దీపావళి కానుకగా ఒక డీఏ ప్రకటించడం హర్షణీయమని, అయితే పీఆర్సీని నియమించకపోవడం బాధాకరమన్నారు. సాధ్యమైనంత త్వరగా ఉద్యోగ, ఉపాధ్యాయుల ఇతర డిమాండ్లను నెరవేర్చాలని కోరారు.

రైతుల సంక్షేమం పట్టని ప్రభుత్వం

డోన్ టౌన్: రైతులను నిజంగా ఆదుకోవాలన్న చిత్తశుద్ధి ప్రభుత్వాలకు ఉంటే స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను అమలు చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు సుబ్బరాయుడు తెలిపారు. ఆదివారం చిన్న మల్కాపురంలో గ్రామ రైతు సంఘాన్ని ఏర్పాటు చేశారు. గౌరవ అధ్యక్షులుగా మద్దిలేటి, శ్రీఆంజనేయులు, అధ్యక్షుడిగా మనోహర్, ప్రధాన కార్యదర్శిగా వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షుడిగా మధుమోహన్, సహాయ కార్యదర్శిగా రాహుల్‌కుమార్, కోశాధికారిగా శివరాముడు, కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు.

నిజాయితీతో పనిచేస్తే ఉన్నత పదవులు

బేతంచెర్ల: కష్టపడే తత్వం, నీతి నిజాయితీతో పనిచేస్తే ఉన్నత స్థాయి పదవులు వరిస్తాయని పారిశ్రామికవేత్తలు గుండా జయచంద్ర, మద్దయ్య, బుగ్గన రమణారెడ్డి, వార్డు కౌన్సిలర్ చింతల నాగిరెడ్డి అన్నారు. శేషారెడ్డి ఉన్నత పాఠశాల 1987-88 బ్యాచ్ 10వ తరగతి పూర్వ విద్యార్థులు బుగ్గానిపల్లె తండాకు చెందిన చిన్న రాముడు ఐఏఎస్‌గా, చంద్రమౌళీశ్వర్‌రెడ్డి శ్రీశైలం దేవస్థానం ప్రత్యేక ఆహ్వానితుడిగా బాధ్యతలు చేపట్టడంతో ఆదివారం వారి మిత్రులు ఘనంగా సన్మానించారు.